క్లుప్తంగా

సీఎం కప్ వాలీబాల్ విజేత జట్టు జూలపల్లి



గెలిచిన జట్టుతో ఎంపీడీవో వేణుగోపాలరావు

జూలపల్లి: పెద్దపల్లి జిల్లా సీసీఎంకప్– 2023 వాలీబాల్ టోర్నీలో జూలపల్లి జట్టు విజయం సాధించింది. గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన క్రీడల్లో జూలపల్లి క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో విజయం సాధించారు. క్రీడాకారులకు జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఎంపీపీ రమాదేవి అభినందించారు. ఈ సందర్భంగా క్రీడలకు హాజరైన ఎంపీడీవో వేణుగోపాలరావు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. సతీశ్, కమలాకర్‌రెడ్డి, ఖాజా, రాజశేఖర్, సాగర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో కందకం పనులు ప్రారంభం



కందకం పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్‌లో ఉపాధిహామీ పథకంలో యాదవ సంఘానికి కేటాయించిన స్థలంచుట్టూ నీటినిల్వలు ఉండేలా కందకం పనులను సోమవారం సర్పంచ్ పల్లె ప్రతిమ ప్రారంభించారు. గ్రామానికి చెందిన 200 మంది ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించామన్నారు. కార్యక్రమంలో యాదవసంఘం అధ్యక్షుడు జక్కుల రాజయ్య, మండల శంకర్, కెక్కర్ల ఉష, సింగనవేన రవి, కండె కిష్టయ్య పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య పనులు



పనులను పరిశీలిస్తున్న ఎంపీవో కిరణ్

జూలపల్లి: వర్షాకాలానికి ముందు గ్రామాల్లో పారిశుధ్య పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పక్కాగా అమలు చేయించినట్లు ఎంపీవో కిరణ్ తెలిపారు. సోమవారం మండలంలోని వడ్కాపూర్, కాచాపూర్, వెంకట్రావుపల్లె గ్రామాల్లో పారిశుధ్యం పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో కిరణ్ మాట్లాడుతూ.. ఎండలను దృష్టిలో పెట్టుకుని ఉదయం, సాయంత్రం పారిశుధ్య పనులను కొనసాగించినట్లు తెలిపారు. జూలపల్లిలో కార్యదర్శి లచ్చయ్య, వడ్కాపూర్‌లో మౌనిక, కాచాపూర్ శరత్, వెంకట్రావుపల్లెలో సంతోశ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్‌కు చెందిన నంది రాజయ్య రైతుకు చెందిన పాడి గేదె సోమవారం గ్రామశివారులో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన గేదె తిరిగి రాకపోవడంతో గ్రామశివారులో వెతికారు. ఈక్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందినట్లు గుర్తించి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పాడి గేదె మృతితో ఆర్థికంగా నష్టపోయానని ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

బొడ్రాయి వేడుకలు ప్రారంభం



పూజలు చేస్తున్న కార్పొరేటర్ జెట్టి జ్యోతి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీలో అర్చకుడు రాపెల్లి మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం కార్పొరేటర్ జెట్టి జ్యోతి పూజలు చేశారు. కార్యక్రమంలో జెట్టి రమేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



మంథని: ప్రభుత్వ వైద్యశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో సహాయ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మంథని బ్లడ్‌బ్యాంక్‌లో రక్త నిల్వలు నిండుకోవడంతో శిబిరం నిర్వహించినట్లు ట్రస్టు చైర్మన్ మేడగోని వెంకటేశ్ తెలిపారు. వైద్యుడు అక్షయ్‌కుమార్, ట్రస్టు వైస్‌చైర్మన్ బొడ్డు సతీశ్, కార్యదర్శి బుద్దార్తి సతీశ్‌కుమార్, సభ్యులు డేవిడ్, విజయ్‌కుమార్, కడియాల వేణు, రాజేందర్, ఉన్నారు,

ఆదరణ లేక.. బతుకు భారమై..

- కునారిల్లుతున్న కుమ్మరి వృత్తి
- కష్టంగా మారిన జీవనోపాధి
- పేదోడి ఫ్రిజ్‌కు తగ్గిన మక్కువ
- చేయూతనివ్వాలంటున్న కుమ్మర్లు

> మట్టి పాత్రల్లో చేసే వంటకాల రుచే వేరని, వాటిలో నీరు నిల్వచేసి తాగితే రోగాలు మాయం అవుతాయన్నది ఎంత వాస్తవమో కానీ.. పూర్వీకుల నుంచి రెండు తరాల ముందు వరకు ఇంటింటా మట్టి పాత్రలదే కీలకపాత్ర. కాలక్రమేణా వాటి ఉనికితో పాటు.. తయారు చేసే కుమ్మరుల వృత్తి ప్రశ్నార్థకంగా మారింది.



ఆములో నుంచి కుండలు తీస్తున్న మహిళ

ఎలిగేడు: వేసవి అనగానే టక్కున గుర్తుకు వచ్చేది చల్లని నీరు. అవి మట్టికుండలోవైతే మరీ మంచిదని భావించే వారు. కానీ... మారుతున్న కాలంతోపాటు అలవాట్లు మారడం సహజం. అందులో భాగంగానే పేదోడి ఫ్రిజ్‌గా పిలిచే మట్టికుండలకు రాను, రాను ఆదరణ తగ్గి.. రిఫ్రిజిరేటర్ల వాడకం పెరిగింది. అల్యూమినియం, స్టీల్, ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో మట్టి కుండల తయారీ తగ్గింది. దీంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ లేక కుమ్మరులు తమ బ్రతుకులు భారంగా మారాయని ఆందోళన చెందుతున్నారు.

మట్టి కొందామంటే ఇబ్బందే

ఏన్నో ఏళ్లుగా కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న తమకు ప్రభుత్వ ఆదరణ కరువైందని, అయినప్పటికీ బతుకు బండిని లాగిస్తున్నామని పలువురు కుమ్మర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలిగేడు మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు 80 కుమ్మరి కుటుంబాలున్నప్పటికీ ప్రస్తుతం ఒక్క ముప్పిరితోటలోనే రెండు మూడు కుటుంబాలు మాత్రమే కుమ్మరి వృత్తిని కొనసాగిస్తున్నాయి. కుండల తయారీకి మట్టిని తేవాలంటే నానా తంటాలు పడుతున్నామని, కష్టపడి కుండలు తయారుచేస్తే కష్టానికి తగ్గ ఫలితం లభించడం లేదని, కుండల ధరలు పెంచితే కొనేవారు ముందుకు రావడం లేదని, అలాగని వృత్తిని మానుకుంటే బతికేదెట్లా అని కుమ్మర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదరణ కరువై

పేదోడి ఫ్రిజ్‌గా పిలవబడే మట్టి కుండలు గతంలో భలే గిరాకీ ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడంలేదు. చల్లటి నీరు అనగానే ఫ్రిజ్‌లు గుర్తుకు వస్తున్నాయి. మట్టి కుండలను ఇప్పటికీ అక్కడక్కడా వాడుతున్నప్పటికీ నాటి వైభవం కానరావడం లేదని కుమ్మరులు వాపోతున్నారు. గతంలో గ్రామాల్లో బోనాల పండుగవస్తే కుండలు అమ్ముడు పోయేవని ఇప్పుడు గతంలో కంటే కొంతమంది మాత్రమే బోనాలను కుండల్లో వండి నైవేద్యం సమర్పిస్తుండగా మిగతావారు ఇంట్లో పాత్రల్లో వండుతున్నారన్నారు. దీంతో గిరాకీలు సైతం తగ్గాయనీ ఏడాది మొత్తంగా నాలుగు, ఐదు నెలలు మాత్రమే పని ఉంటుందని మిగతా సమయాల్లో ఇతర పనులకు వెళ్తున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కులవృత్తులకు చేయూతనందిస్తున్నట్లుగానే కుమ్మరి వృత్తిదారులను ఆదరించాలని కోరుతున్నారు.

వృత్తినే నమ్ముకున్నం



కులవృత్తినే నమ్ముకున్నాం. అదే పనిని చేసుకుంటున్నాం. గతంలో కంటే కుండల గిరాకీ చాలా తగ్గింది. వేసవిలో కొంత అమ్మకాలు చేస్తుంటాం. పండుగలకు బాగానే అమ్ముడుపోతై. పెద్దగా లాభాలు లేకపోయినా. వృత్తిని వీడు తలేం. ప్రభుత్వ నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆర్థికసాయం అందలేదు.
– ఆశాడపు శంకరయ్య, కుమ్మరి వృత్తిదారుడు

సబ్సిడీపై రుణాలందించాలి



కనుమరుగవుతున్న కుమ్మరుల కులవృత్తిని ప్రభుత్వం ప్రోత్సహించి ఆదుకోవాలి. కుండల తయారీకి వృత్తిదారు లకు 100 శాతం సబ్సిడీపై రుణాలు అందించాలి. కులవృత్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మట్టి కుండలకు ఆదరణ లేక ఇబ్బంది పడుతున్నాం
– ఆశాడపు వెంకటేశ్, కుమ్మరిసంఘం జిల్లా కార్యదర్శి

ధాన్యం రవాణా, కొనుగోళ్లలో వేగంపెంచాలి

- రైతులకు ఇబ్బంది కలిగించొద్దు
- సివిల్‌సప్లై అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని తూకం వేయించి వెంటనే లారీల్లో మిల్లులకు తరలించేపనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాసి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. రవాణా కోసం అవసరమైనన్నీ లారీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. మిల్లుల వద్ద జాప్యం లేకుండా దిగుమతులు జరిగేలా చూడాలన్నారు. మళ్లీ వర్షాలు పడేఅవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేసేలా చూడాలన్నారు. శ్రీరాంపూర్ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, నాయకులు మొబిన్, మోహన్ తదితరులున్నారు.

గ్రూప్ 4 పరీక్ష కేంద్రాల పరిశీలన



గదులను పరిశీలిస్తున్న తహసీల్దార్ జయశ్రీ

జూలపల్లి: గ్రూప్ 4 రాత పరీక్ష నిర్వహణకు మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పెద్దాపూర్ ఆదర్శపాఠశాలను అధికారులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయశ్రీ పరిశీలించి వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ విద్యాలయంలో 480 మందికి కేటాయించగా, కళాశాలలో 300 మందిని పరీక్షలు రాసేందుకు కేటాయించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ సంపత్, వీఆర్ఏమల్లేశం, జూనియర్‌అసిస్టెంట్ పుష్ప ఉన్నారు.

పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యం అందించాలి



వినతిపత్రం ఇస్తున్న సాయికుమార్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సోమవారం యూత్ కాంగ్రెస్ ప్రతినిధి సాయికుమార్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. పీహెచ్‌సీలో అన్నిరకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు యంత్రాలు ఏర్పాటు చేసి మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు రాజేశం, సతీశ్, సంజీవ్, తరుణ్, కార్తీక్, శ్రీనివాస్, సంతోష్, అనిల్, వంశీ తదితరులున్నారు.

సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి కలెక్టర్ గ్రీన్‌సిగ్నల్

రూ 20 లక్షలు నిధులు మంజూరు

ఓదెల: మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి కలెక్టర్ సంగీత సత్యనారాయణ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ సోమవారం తెలిపారు. ఆలయంలో మూత్రశాలలు మరగుదొడ్లు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆలయచైర్మన్ ఇటీవల కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ భక్తుల రద్దీకి సరిపడేలా సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరుచేసినట్లు చైర్మన్ తెలిపారు. పనులు త్వరలో ప్రారంభించనట్లు చైర్మన్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

గోదావరిఖనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి జర్నలిస్టులకు ఇళ్ల స్థలా లు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహా య కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం డిమాండ్ చేశా రు. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని మాట ఇచ్చి మరిచిందని ప్రీతం విమర్శించారు. జర్నలిస్టులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లునిర్మించి ఇవ్వాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని లేకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్‌లో చేరడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాంబాబు తెలిపారు. మోడల్ స్కూల్‌లో పదోతరగతి పూర్తిచేసిన, ఇతర విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు బాలికలకు హాస్టల్ వసతి కల్పించినట్లు తెలిపారు. ఎంపీసీలో 40, బైపీసీలో 40, సీఈసీలో 40, ఎంఈసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ కాపీ, ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్ సెట్‌ను పాఠశాలలో అందించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కంటి వెలుగులో 162 మందికి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట జీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యాక్రమంలో భాగంగా సోమవారం 12 మందికి కంటి పరీక్షలు చేసి 8మందికి కంటి అద్దాలు అందించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా, సర్పంచ్ కావేరి, కంటివెలుగు క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

సుల్తానాబాద్: కూరగాయల సంతలో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం సుల్తానాబాద్ వారసంతలో ప్లాస్టిక్ కవర్లను వార్డు అధికారి రమేశ్ స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగంతో కలిగే అనర్థాలు వివరించారు. ప్లాస్టిక్ వినియోగించరాదని సూచించారు.

మంథనికి తరలిన కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: కర్ణాటక ఎన్నికల అనంతరం మంథనికి వస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు స్వాగతం పలికేందుకు ఆదివారం కాలనీ కాంగ్రెస్ నాయకులు బైక్‌పై ర్యాలీగా మంథనికి తరలివెళ్లారు. తరలివెళ్లిన కాలనీ పట్టణ అధ్యక్షుడు రాజేశ్, చక్రపాణి, తిరుపతి, కిషన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

కాలువ మరమ్మతులు ప్రారంభం

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి జీపీ పరిధిలో చింతలచెరువు కింద కాలువలు, తూములు నిర్మించేందుకు సోమవారం పనులను సర్పంచ్ స్వరూప, డీఈ కీర్తన ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ చింతల చెరువు కింద ఇరిగేషన్ కాలువలు, తూములు మరమ్మతులు, చేపట్టేందుకు రూ. 24 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. సర్పంచ్ రాజ్ కొమురయ్య, వార్డు సభ్యులు శ్రీనివాస్, బుర్ర లక్ష్మి హేమలత పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

రామగుండం: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 2023–24వ విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఏప్రిల్ 16న ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో 524 మంది దరఖాస్తు చేసుకోగా 416 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీస్‌బోర్డుపై అంటించారు. మెరిట్, స్థానికత, రిజర్వేషన్ ప్రాతిపదికన కలెక్టర్ ఆమోదం తెలిపిన వారికే ఆరోతరగతిలో ప్రవేశం కల్పిస్తామని మోడల్‌స్కూల్‌ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ తెలిపారు.

సాహితీవేత్త విశ్వనాథ్‌రెడ్డికి అరసం సంతాపం

గోదావరిఖనిటౌన్: ప్రముఖ సాహితీవేత్త, అభ్యుదయ రచయితల సంఘం(అరసం)నేత డా.కేతు విశ్వనాథ్‌రెడ్డి మృతికి తెలంగాణ అరసం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, పూర్వ ప్రధానకార్యదర్శి, జాతీయ కమిటీ సభ్యుడు వేల్పుల నారాయణ, నాయకులు ఏలేశ్వరం వెంకటేశ్, వై.లెనిన్, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకుడు కె.స్వామి, కన్నం లక్ష్మీనారాయణలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు.

శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో విశేష పూజలు



పూజలు చేస్తున్న మంచిర్యాల వాసులు

రామగుండం: అబాది రామగుండంలోని శ్రీకాశీ విశ్వేరాలయంలో భక్తులు బ్రహ్మసూత్ర శివలింగానికి విశేష పూజలు చేశారు. ఆలయ పూజారి బుగ్గ శ్రీనివాస్‌శర్మ భక్తులతో శివాలయంలో పంచామృతాలతో అభిషేకం చేయించారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో ఆలయ శిఖర గోపురం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుక లు నిర్వహిస్తుండగా ముందస్తుగా దర్శనం చేసుకుంటున్నారు.

చెరువు మట్టి తరలింపుపై ఫిర్యాదు

పెద్దపల్లిరూరల్: మండలంలోని రాఘవాపూర్ శివారు ప్రాంతాల్లో నిల్వచేసిన చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామానికి చెందిన తాడిచెట్టి శ్రీకాంత్ బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత సీజన్‌లో పెద్ద చెరువు నుంచి మట్టిని పెద్దఎత్తున గ్రామశివారులోని పొలాల్లో నిల్వచేశారని పేర్కొన్నారు. ఆ సమయంలో గ్రామసభ నిర్వహించి, గ్రామాభివృద్ధికి ట్రిప్పునకు రూ.300 చెల్లిస్తామని తీర్మానించారన్నారు. ఇప్పటివరకు ఆ డబ్బులు ఇవ్వకుండా చెరువు మట్టిని అమ్ముకుంటున్నారని అన్నారు. అతని వెంట గ్రామపెద్దలు ఉన్నారు.

ఐదుగురి బైండోవర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణానికి చెందిన ఐదుగురు యువకులను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పట్టణంలో జులాయిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండటంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ నిర్వహించి, బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం



అధికారులతో మాట్లాడుతున్న బలరాంరెడ్డి

ధర్మారం: ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం లేకుండా తూకం వేయిస్తామని సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి అన్నారు. ధర్మారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం బలరాంరెడ్డితో పాటు మార్కెట్‌కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా బలరాంరెడ్డి జిల్లాస్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరగా తూకం వేయించాలని కోరారు. తడిసిన ధాన్యంపై రైతులు ఆందోళ న చెందాల్సిన పనిలేదని తప్పకుండా తూకం వేయి స్తారన్నారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించిందన్నారు. మార్కెట్‌కమిటీ డైరెక్టర్ నాడెం శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినోద్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ధర్మారం/జూలపల్లి/కమాన్‌పూర్: ధర్మారం మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మురికి వెంకన్న కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద చికిత్స పొందుతున్న ధర్మారం గ్రామానికి చెందిన ఎంపెల్లి సత్తయ్యకు కాంగ్రెస్ నాయకుడు మద్దెల రవీందర్ రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. జూలపల్లి మండలంలోని కుమ్మరికుంటకు చెందిన నిరుపేద కొప్పుల యేసయ్య అనారోగ్యంతో మృతిచెందగా కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ రూ.5వేలు ఆర్థికసాయం పంపించారు. సేవాదళం జిల్లా కార్యదర్శి శాతల్ల కాంతయ్య బాధిత కుటుంబానికి నగదు అందించారు. రామగిరి మండలం బేగంపేట గ్రామం మాజీ సర్పంచ్ కొండ్ర వెంకన్నగౌడ్, పాత్రికేయుడు కొండ్ర సుకుమార్ తల్లి కొండ్ర రాజమ్మ ఇటీవల మృతిచెందగా మృతురాలి కుటుంబాన్ని రామగిరి తహసీల్దార్ చల్లా రామ్మోహన్ పరామర్శించారు.

‘పచ్చిరొట్ట విత్తనాలతో పోషకాలు అధికం’



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కాల్వశ్రీరాంపూర్: పచ్చిరొట్ట విత్తనాలతో పంటలకు అధిక పోషకాలు అందుతాయని నాణ్యతతో పాటు అధిక దిగుబడులు వస్తాయని ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఏవో నాగార్జున అన్నారు. మండలంలోని కూనారం గ్రామంలో సోమవారం సింగిల్‌విండో కార్యాలయంలో జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీచేశారు. పచ్చిరొట్టవిత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో కార్యాలయానికి రావాలన్నారు. 30 కిలోల బస్తాకు సబ్సిడీపై రూ. 850 చెల్లించాలన్నారు. ఒక బస్తా రెండున్నర ఎకరాల్లో సాగుచేయొచ్చన్నారు. సర్పంచ్ విజయ, ఎంపీటీసీ రమాదేవి, రైత సేవాసమితి మండల కన్వీనర్ దేవయ్య సింగిల్‌విండోచైర్మన్ పురుషోత్తం, వైస్ చైర్మన్ బీసగోని తిరుపతి, సీఈవో విజేందర్, ఏఈవో రాజు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల వాడకం మేలు

మంథని: పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో పంటకు మేలు కలుగుతుందని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని సహకార సంఘానికి 417 జీలుగ బస్తాలు వచ్చాయన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో భూ సాంద్రత అధికంగా పెరిగి పంటలకు మేలు చేకూరుతుందన్నారు. సబ్సిడీపై రూ.842.70 చెల్లించి 30 కిలోల జీలుగు విత్తనాలు పొందవచ్చన్నారు. రైతులు ఆధార్, పట్టాదురు పాసుపుస్తకం, జిరాక్స్ ప్రతులను సమర్పించి విత్తనాలు పొందవచ్చని శ్రీనివాస్ తెలిపారు.

‘బహుజనులపై దాడులు చేస్తే ఊరుకోం’



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీనాయకులు

పెద్దపల్లిరూరల్: బీఆర్ఎస్ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు మాఫియా అవతారమెత్తి విపక్షాలపై, బహుజనులపై దాడులకు పాల్పడుతున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లిలోని బస్టాండ్ వద్ద సోమవారం తుంగతుర్తి నియోజకవర్గంలో న్యాయవాది యుగంధర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఉష మాట్లాడుతూ.. తుంగతుర్తి ఎమ్మెల్యే అవినీతి అక్రమాలను వెలికి తీస్తున్నాడనే కారణంతో తన అనుచరులతో దాడులు చ ఆరోపించారు. బహుజనులపై దాడులకు దిగితే ఊరుకోమన్నారు. బహుజనులంతా ఏకమై అండగా నిలుస్తారన్నారు. బీఆర్ఎస్ నాయకుల ఆగడాలను ప్రజలంతా గమనిస్తున్నారని సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. నాయకులు రాజు, వెంకటేశ్, బాబు, రవి, దుర్గయ్య, గోపాల్, చంద్రమౌళి, బొందాలు, రియాజ్, అరుణ, శారద తదితరులున్నారు.

ఉద్యమంలా స్వచ్ఛ సర్వేక్షణ్



సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్

సుల్తానాబాద్: స్వచ్ఛసర్వేక్షణ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో వార్డు కౌన్సిలర్లు, మెప్మాలు, ఆర్పీలు ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమం నెలపాటు కొనసాగుతుందన్నారు. వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గాజు సీసాలు, ఇనుప ముక్కలు, తడి, పొడి చెత్తను విధిగా వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. రోడ్లపై, మురుగుకాలువల్లో ప్లాస్టిక్ వస్తువులు వేయొద్దని వివరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు, ఆర్పీలు ఉన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్!



పనులను పరిశీలిస్తున్న చంద్రమౌళి

ఎలిగేడు: వర్షాకాలం ముందు గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య పనులు ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల్లో కొనసాగుతున్నాయి. పల్లె ప్రగతిలో భాగంగా వారం రోజులు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించేందుకు ఈనెల 17 నుంచి గ్రామాల్లో చెత్త తరలింపు ప్రక్రియ మొదలైంది. పారిశుధ్య కార్యక్రమాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి గ్రామాల్లో పనులు దగ్గరుండి చేయిస్తున్నారు. ఇందులో పంచాయతీ సిబ్బందితో పాటు, ప్రత్యేకంగా కూలీలను నియమించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, మండల, జిల్లాస్థాయి అధికారులు రోజువారి కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 23 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కిందిస్థాయి సిబ్బందికి సూచించారు.

పిచ్చిమొక్కల తొలగింపు..

గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల వెంట పిచ్చిమొక్కలు పెరగడంతో సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటా సందర్శించి ఉపయోగంలో లేని వస్తువులు, చెత్తకుప్పలు, వ్యర్థాలను ట్రాక్టర్లతో తొలగించే పనులు చేపడుతున్నారు. ఇళ్లలోని నీరు బయటకు రాకుండా ఇంకుడుగుంతలు, కిచెన్‌గార్డెన్లు నిర్మించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా లోతట్టు ప్రాంతాల్లో మట్టిని నింపుతామని, ఎప్పటిప్పుడు శుభ్రతపై దృష్టిసారించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం



పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిచి మండలంలోని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యక్షేక్షిస్తున్నాం. గ్రామాల్లో చెత్త తొలగింపు, వ్యర్థాల తలింపు వంటి పనులను వేగంచేశాం. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా ముందస్తుగా ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ ఎంతో ఉపయోగపడుతుంది.
– అనిల్‌రెడ్డి , ఎంపీవో ఎలిగేడు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని : రాజేశ్ - 9676603963
పెద్దపల్లి : నరేశ్ - 8639544665
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899